


భక్తి శ్రద్ధలతో.. రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- వేలాదిగా తరలి వచ్చిన ముస్లింలు



● గుంటూరు: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

గుంటూరు, ఏప్రిల్ 11: పవిత్ర రంజాన్ పండుగను గురువారం జిల్లా అంతటా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనంతో గురువారం ఈద్ ఉల్ ఫితర్ పర్వ దినాన్ని అట్టహాసంగా చేసుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన వారు దీక్షలు విరమించి రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద జరిగే ప్రార్థనలకు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా భారీగా హాజరయ్యారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆలింగనాలు చేసుకుంటూ సందడి చేశారు. ఈద్గా మైదానాల వద్దకు పెద్దసంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం రంజాన్ విశిష్టతను చాటిచెబుతూ మతపెద్దలు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు. పోలీసులు ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం, ఫిత్రా అందజేశారు.



గుంటూరు: కలెక్టరేట్ రోడ్డులో ముస్లింల ప్రార్థనలు

● నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి ముస్లింలు ప్రార్థనలకు వేలాదిగా తరలి వచ్చారు. ప్రకాష్‌నగర్ వీధులు ముస్లింలతో కిటకిటలాడాయి. సాహి ఇమామ్ రజా ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రార్థనలకు హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పెదతురకపాలెం, చినతురకపాలెం, ములకలూరు తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

● బాపట్లలోని పలు ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఇస్లాంపేట, జమేదారుపేట ఈద్గాలు ముస్లింలతో కిటకిటలాడాయి. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మంగళగిరిలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నారా లోకేశ్

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు, విశ్రాంత ఐపీఎస్ దీపక్ మిశ్రా

నరసరావుపేట, ఏప్రిల్ 11: పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా, పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహించాలని పోలీస్ ప్రత్యేక పరిశీ లకుడు, విశ్రాంత ఐపీఎస్ దీపక్‌మిశ్రా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై నరసరావుపేట కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఒక వర్గానికి, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించరాదన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ వివరించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు, సీ విజిల్ యాప్, ఎన్నికల నియమావళి తదితర అంశాలను తెలిపారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.139.51 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టుల వద్ద తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చీ, రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జేసీ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రత్యేక పరిశీలకుడు దీపక్‌మిశ్రా, అడిషనల్ డీజీపీ శంఖబ్రతబాగ్చీ, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్

ప్రజాగళం నేడే

- కొల్లూరు, రేపల్లెలో బహిరంగ సభలు
- చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- పెద్దసంఖ్యలో హాజరు కానున్న టీడీపీ శ్రేణులు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అనగాని, ఆనందబాబు



బాబు పర్యటన ఇలా..

శుక్రవారం మధ్యాహ్నం హెలికాప్టర్‌లో చంద్రబాబు కొల్లూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొల్లూరుకు చేరుకుని ప్రజాగళం సభలో ప్రసంగిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో రేపల్లె ఎన్టీఆర్ సర్కి ల్‌కు చేరుకుని అక్కడ జరిగే సభలో ప్రసంగిస్తారు. రాత్రికి రేపల్లెలోని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. శనివారం ఉదయం పార్టీ నేతలతో సమీక్ష అనంతరం మధ్యాహ్నం తాడేపల్లికి రేపల్లెలోని హెలిప్యాడ్ నుంచి వెళ్తారు.

వేమూరు, రేపల్లె, ఏప్రిల్ 11: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా కొల్లూరు, రేపల్లెలో జరిగే ప్రజాగళం బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ నేతలు ఇప్పటికే పూర్తి చేశారు. మధ్యాహ్నం వేమూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరులో బహిరంగ సభ జరగనుండగా, సాయంత్రం రేపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రజాగళం సభ జరగనుంది. ఒకే రోజు రెండు నియోజకవర్గాల పరిధిలో చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. వేమూరులోని బాపట్ల లోక్‌సభ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ఇంటి సమీపంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను గురువారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద 500 మంది మహిళలతో చంద్రబాబుకు స్వాగతం పలుకుతామని విజయ్‌బాబు తెలిపారు. వేమూరు నుంచి రోడ్డు మార్గంలో చంద్రబాబు కొల్లూరుకు వచ్చి అక్కడ శివాలయ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాగళం సభలో ప్రసంగించనున్నారు. ఆయా ఏర్పాట్లను గురువారం ఆనందబాబుతో కలిసి రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలతో పాటు తెనాలి పరిసర ప్రాంతాల నుంచి భారీగా జనసమీకరణ చేయాలని నాయకులకు ఆనందబాబు సూచించారు. పెద్ద సంఖ్యలో ప్రజాగళం సభకు తరలి వచ్చే కూటమి శ్రేణులు, టీడీపీ అభిమానులకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆనందబాబు తెలిపారు. చంద్రబాబు అనుమతిస్తే వేమూరులో హెలికాప్టర్ దిగిన వెంటనే మహిళలతో ఇష్టాగోష్ఠిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాగళం సభ విజయవంతంపై ఆనందబాబు భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు, వేమూరు తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేశారు.



ఉప్పూడి రోడ్డులోని హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనగాని, చంద్రబాబు భద్రతా సిబ్బంది

రేపల్లెలోనే రాత్రి బస

ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రజాగళం సభ అనంతరం చంద్రబాబు రాత్రి బస రేపల్లెలోనే ఉంటుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఉప్పూడి రోడ్డులోని హెలిప్యాడ్, ఎన్టీఆర్ సర్కిల్ సభా ప్రాంగణాన్ని గురువారం ఆయన పరిశీలించి ఏర్పాట్లపై నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని చంద్రబాబు పర్యటనను విజయవంతం చెయ్యాలని కోరారు. సభ అనంతరం టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు రాత్రికి బస చేస్తారని తెలిపారు.

వేమూరులో హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య, అధికార పార్టీ ప్రతినిధి విజయబాబు



పోలీసుల పేరుతో.. సైబర్ క్రైమ్

- టెలికమ్యూనికేషన్స్ నుంచి అంటూ ఓ మహిళ ఫోన్
- సెక్స్ స్కాండల్, మనీ లాండరింగ్ చేసినట్లు అభియోగాలు
- మహారాష్ట్ర పోలీస్ ఐడీ స్కైప్ ద్వారా లైన్‌లోకి తీసుకుని బేరాలు
- చివరి క్షణంలో అప్రమత్తమై ఫేక్ కాల్‌గా గుర్తించిన బాధితుడు



గుంటూరు, ఏప్రిల్ 11: సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెర తీశారు. ఓటీపీలు, టాస్కులు వంటి నేరాలపై ప్రజల్లో అవగాహన కలగడంతో రూటు మార్చి పోలీసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేసి వీడియో కాల్ చేసి నగదు బదిలీ చేయాలని మోసాలకు పాల్పడుతున్న ఘటన గుంటూరులో తాజాగా వెలుగు చూసింది. లోక్‌సత్తా సంస్థ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గుంటూరుకు చెందిన కొత్తా సూర్య చివరి క్షణంలో అప్రమత్తమై ఫేక్‌కాల్‌గా గుర్తించి సైబర్ క్రైమ్ నుంచి తప్పించుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఓ అపరిచిత మహిళ ఫోన్ చేసి తాను డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికమ్యూని కేషన్స్ (డీవోటీ) నుంచి మాట్లాడుతున్నట్లు సూర్య కు చెప్పింది. ఆధార్ కార్డుతో లింకైన మరో ఫోన్ నెంబరుపై కేసు నమోదైందని చెప్పి కాల్‌ను ముంబై పోర్ట్ పోలీసులకు బదిలీ చేసింది. నగ్న వీడియోల లింకులు పంపారని, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని, మీ పేరు మీద 24 కేసులున్నాయి తాను మీపై నమోదైన కేసులకు ఇన్‌చార్జినని ఓ వ్యక్తి సూర్యకు చెప్పాడు. అయితే ఆ నెంబర్ తనది కాదని, తానెప్పుడూ ముంబైలో సిమ్ తీసు కోలేదని చెప్పగా మీ పేరుతో ఈ నెంబర్ ఉందని దీని ద్వారానే అనేక నేరాలు జరిగాయని అందు వల్ల మీరు ఒకసారి ముంబై పోర్ట్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పాడు. అయితే ప్రస్తుతం తాను వేరే పెళ్లి హడావుడిలో ఉన్నందున తర్వాత వస్తానని సూర్య బదులిచ్చారు. స్కైప్ ద్వారా స్టేట్మెంట్ ఇవ్వాలని, మహారాష్ట్ర పోలీస్ 236 అనే స్కైప్ ఐడీ ద్వారా లైన్‌లోకి రావాలని చెప్పాడు. దీంతో సూర్య ఆ ఐడీ ద్వారా స్కైప్‌లో వారితో వీడియో కాల్‌లోకి వారు చెప్పినట్లు కనెక్ట్ అయ్యాడు. ఈ క్రమంలో వ్యక్తిగత వివరాలు అడుగుతూనే.. నెంబరు మీది కాదంటున్నారు, ఏ నేరం చేయలేదంటున్నారు కాబట్టి ఒకసారి సైబర్ క్రైమ్ వారిని సంప్రదించి కేసు క్లోజ్ చేస్తానని చెప్పి వైర్లెస్ సెట్ ద్వారా పోలీసు అధికారుల తరహాలో మాట్లాడుతున్నట్లు అతడు మాట్లాడాడు.

సూర్య ఆధార్ కార్డు నెం బర్ తీసుకుని మనీ లాండరింగ్ వంటి మరో రెండు కేసులు నమోదయ్యాయని అతడు చెప్పాడు. గతంలో జెట్ ఎయిర్ వేస్ ఎండీ నరేష్ గోయల్ ఆస్తులపై దాడి చేసిన సమయంలో అక్కడ లభించిన వాటిలో మీ ఏటీఎం కార్డు కూడా లభించిందని, మీ పేరుతో ముంబై కెనరా బ్యాంకులో అకౌంట్ ఉందని దాని ద్వారా రెండు కోట్ల లావాదేవీలు జరిగాయని బెదిరించాడు. ఆ కేసుకు తానే ఇన్‌చార్జినంటూ పోలీస్‌స్టేషన్ వివరాలు తీసుకుని నల్లపాడు పోలీసులు వచ్చి అరెస్టు చేస్తారని బెదిరించాడు. తాను పెళ్లి హడావుడిలో ఉన్నానని సూర్య చెప్పగా.. లైన్లో ఉండండని చెప్పిన అతడు పక్కకు వెళ్లి ఓ అధికారితో మాట్లాడినట్లు మాట్లాడి మళ్లీ లైన్‌లోకి వచ్చి సరే మూడు రోజుల వరకు మీకు వెసులుబాటు ఇవ్వాలంటే వెంటనే తాము పంపే అకౌంట్‌కు రూ.50 వేలు సెక్యూరిటీ డిపాజిట్ పంపాలని ఇండస్‌ఇండ్ బ్యాంకు ఖాతా నెంబరు పంపాడు. అయితే తన ఫోన్లో చార్జింగ్ అయిపోతుందని ఇంటికి వెళ్లిన తర్వాత డబ్బు పంపిస్తానని సూర్య చెప్పగా ఫోన్‌లైన్లో ఉన్న వ్యక్తి సరేనన్నాడు. ఆ తర్వాత అనుమానం వచ్చిన సూర్య వెంటనే ముంబైలో ఉన్న తన స్నేహితుడికి ఫోన్ చేసి అడగ్గా ఇదే తరహాలో ఇటీవల అనేక మోసాలు జరిగాయని తనకు కూడా ఇలాంటి ఫేక్ కాల్ వచ్చినట్లు అతను చెప్పారు. దీంతో సూర్య ఇండస్ ఇండ్ బ్యాంకు వారిని సంప్రదించగా ఆ బ్యాంకు ఖాతా ముంబైదే గాని అయితే ఇప్పటికే పలువురు మోసపోయినట్లు చెప్పారు. ఆ ముఠా కేసుల పేరుతో సీబీఐ, ఈడీ అధికారులమని సినిమా సెట్టింగ్‌లు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్లు చేసి డబ్బు దోచుకుంటున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ తరహా కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.

రాక్షస పాలకులను గద్దె దించాలి

- నిజం గెలవాలి యాత్రలో నారా భువనేశ్వరి
- వేల్పూరు, కొలకలూరులో బాధిత కుటుంబాలకు పరామర్శ



కొలకలూరులో శివరామయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి

వేల్పూరు(శావల్యాపురం), ఏప్రిల్ 11: రాష్ట్రంలో రాక్షస పాలన ఉంది. రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతుంది. ప్రజలను నరకడం, హింసించడం తప్ప వైసీపీ గూండాలకు మరేదీ తెలియదు. అలాంటి పాలకులను గద్దె దించాలి. బావితరాలు, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ ఓటును ఆయుధంగా మలుచుకుని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నిజం గెలివాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె శావల్యాపురం మండలం వేల్పూరు, తెనాలి మండలం కొలకలూరులో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో గుండెపోటుతో మృతిచెందిన వేల్పూరు గ్రామానికి చెందిన తెలుగుయువత సభ్యుడు బోయపాటి మణకంఠ, కొలకలూరులో దాచేపల్లి శివరామయ్య కుటుంబసభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా వేల్పూరు కళామందిర్ సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ పులిబిడ్డలే పచ్చసైనికులని, వారంతా సైకిల్‌ను తొక్కుకుంటూ ముందుకెళ్లి టీడీపీ జండాను రెపరెపలాడించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు నిర్బంధించారని, అందుకే ఎప్పుడూ బయటకు రాని తాను మహిళా శక్తిని చాటేందుకు నిజాన్ని గెలిపించేందుకు కార్యకర్తల మధ్యకు వచ్చానన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్న టీడీపీ నేత మన్యం సుబ్బయ్యను కిరాతంగా పొట్టనబెట్టుకున్నారన్నారు. జై జగన్ అనమంటే జై చంద్రబాబు అన్నందుకు మాచర్లలో చంద్రయ్యను దారుణంగా చంపారన్నారు. తాగునీరు అడిగినందుకు హంసవేణి అనే మహిళకు రెండు కళ్ళు పీకేశారని, నందికొట్కూరులో ముస్లిం మహిళను వైసీపీ నాయకులు అవహేళన చేశారన్నారు. వైసీపీ రాక్షస పాలనలో 30,196 మంది మహిళలు కనిపించకుండా పోయారని తెలిపారు. చంద్రబాబు కోసమో, లోకేశ్ కోసమో తాను కార్యకర్తల మధ్యకు రాలేదని, ప్రజాస్వామ్యం నిలబడాలని, రాష్ట్రాన్ని అరాచకాలకు, అక్రమాలకు అడ్డాగా మార్చిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే కార్యకర్తల మధ్యకు వచ్చానన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు, రైతులకు, యువతకు మేలు జరగనుందన్నారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ పారా హైమావతి, టీడీపీ మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేల్పూరులో మణికంఠ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న భువనేశ్వరి



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావు

టీడీపీలోకి వలసల పరంపర..

● నారా లోకేశ్ సమక్షంలో పలువురి చేరికలు

మంగళగిరి, ఏప్రిల్ 11: టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మంగళగిరిని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానన్న లోకేశ్ హామీకి నియోజకవర్గంనుంచి పెద్దఎత్తున స్పందన కనిపిస్తోంది. లోకేశ్ ఇస్తున్న ఈ నినాదానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలోకి చేరిపోతున్నారు. తాజాగా, ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితునిగా వున్న ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావు కూడ టీడీపీ కండువాను కప్పుకున్నారు. ఆయనతోపాటు మరో పదిమంది అనుచరులు కూడా ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బసవరావు గతంలో జగన్‌కు సంఘీభావంగా ఇడుపులపాయ నుంచి విశాఖవరకు రెండువేల కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ విధానాలతో విభేదించి ఎస్సీ కమిషను సభ్యత్వానికి రాజీనామా చేశారు. చంద్రబాబు నేతృత్వంలోనే దళితుల అభ్యున్నతి సాధ్యమని నమ్మి టీడీపీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు. వీరితోపాటు తాడేపల్లి రూరల్ మండలం ఉండవల్లికి చెందిన లంకా భువన శేషగిరి, చరణ్, కె.ఫణిశర్మ ఆధ్వర్యంలో మరో ఇరవైమంది టీడీపీలో చేరిపోయారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఎస్సీల సంక్షేమం కోసం గత టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 పథకాలను రద్దు చేసిన దళిత ద్రోహి జగన్‌రెడ్డని మండిపడ్డారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఇప్పటివరకు 188 దళితులు వూచకోతకు గురయ్యారన్నారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబు వంటి వారిని పక్కన కూర్చోబెట్టుకుని జగన్ దళితుల ఆత్మభిమానాన్ని దెబ్బకొట్టారన్నారు. రోజూ రాష్ట్రంలో ఏదో ఒకచోట దళితులపై దాడులు కొనసాగుతూనే వున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక దళితులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, దళితులపై దాడులకు తెగబడినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో దళితులకు అమలుచేసిన సంక్షేమ పథకాలన్నింటిని తిరిగి పునరుద్ధరిస్తామని, ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతంచేసి స్వయం ఉపాధి రుణాలను అందజేస్తామని లోకేశ్ చెప్పారు.

వేడెక్కిన గురజాల రాజకీయం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 11: రానురాను గురజాల రాజకీయం వేడెక్కుతుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల సవాల్ ప్రతిసవాల్‌తో రంజుగా మారింది. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి.. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విసిరిన సవాల్ వైసీపీ నేతలను ఖంగుతినిపించింది. ఈసారి ఎన్నికల్లో గెలవకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని యరపతి నేని సవాల్ విసిరారు. ఈసవాల్‌ను వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి స్వీకరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కాసు మహేష్‌రెడ్డి కూడా 2019లో జరిగిందే రిపీట్ అవుతుందని, ఈ ఎన్నికల్లో తానే గెలిచి యరపతినేనిని గుంటూరు పంపిస్తానని, ఓడిపోతే తానూ రాజకీయాలనుంచి తప్పుకుంటానని కాసు మహేష్‌రెడ్డి ప్రతిసవాల్ విసరడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం మీద గురజాల రాజకీయ వాతావరణం హీటెక్కింది.

నేడు బొల్లాపల్లికి నారా భువనేశ్వరి రాక

బొల్లాపల్లి, ఏప్రిల్ 11: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని రేమిడిచర్లకు రానున్నారు. అక్రమ కేసులతో చంద్రబాబును జైలుకు పంపటాన్ని తట్టుకోలేక మనోవేదనతో మృతి చెందిన బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని షేక్ హుస్సేన్ సాహెబ్ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించనున్నట్టు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకం

● ముస్లింలకు ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటాం
● పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నసీర్



ఈద్గాలో ప్రార్థన చేస్తున్న పెమ్మసాని, నసీర్, డేగల

గుంటూరు,ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకమని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పాత బస్టాండ్ సెంటర్లో మొమ్మడెన్ ఈద్గాహ్, ఆంధ్ర ముస్లిం కళాశాల ఈద్గాలో జరిగిన ఈద్- ఉల్- ఫితర్ ప్రత్యేక ప్రార్థనలో పెమ్మసాని, నసీర్, డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. ముస్లిం చిన్నారులతో ఫొటోలు దిగి సందడిచేశారు. ఈసందర్భంగా నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ అల్లా ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. ముస్లింలకు ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటూ వారి మనోభావాలకు భంగం కలవకుండా చూసుకుంటామని వారి సమస్యల పోరాటానికి ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ముస్లింల సంక్షేమం అభివృద్ధి చంద్రబాబు ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. ముస్లింలను గౌరవించే పార్టీ టీడీపీ అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలంతా గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థి అయిన పెమ్మసాని చంద్రశేఖర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని, ప్రజలకు సేవ చేసుకునే అదృష్టాన్ని తమకు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, సయ్యద్ ముజీబ్, సయ్యద్ షబ్బీర్, ఆరిఫ్, గుంటూరు తూర్పు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



ముస్లిం చిన్నారులతో ఫొటోలు దిగుతున్న పెమ్మసాని, నసీర్



చంద్రబాబు రోడ్‌షోకి స్థల పరిశీలన చేస్తున్న శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ మంతెన

రేపు తాడికొండలో చంద్రబాబు ప్రజాగళం సభ

తాడికొండ, ఏప్రిల్ 11: తాడికొండ నియోజకవర్గంలో ఈనెల 13న టీడీపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు ప్రజాగళం బహిరంగసభ జరుగుతుందని గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, తాడికొండ నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం తాడికొండ అడ్డరోడ్డు సెంటర్‌లోని నాలుగురోడ్ల కూడలి, తాడికొండలోని ప్రధాన రహదారి ప్రదేశాలను ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, సభ నిర్వహణ కమిటి కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వర్లు, గౌతమ్ టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రోడ్ షో నిర్వహించి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, పత్తిపాడు, పెదకూరపాడు, మంగళగిరి, నియోజకవర్గలకు దగ్గర తాడికొండ ఉండటం వలన ప్రజాగళం సభను ఏర్పాటు చేయటానికి షెడ్యూల్ ఖరారు చేసినట్లు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నేతలు కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, జీ. మధుసూధనరావు, ఎడ్డూరి హనుమంతరావు, చిగురుపాటి అనూఫ్, నీలాల కృష్ణారావు, షేక్ సుభాని, సాంబశివరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

● సంగంజాగర్లమూడిలో పెమ్మసాని



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్11: మౌలిక సదుపాయాలు కల్పించుకుని పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దుకుందామని రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు మండలంలోని సంగంజాగర్లమూడిలో గ్రామస్తులు, పార్టీశ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో కనీస అభివృద్ధికి కూడా నోచుకోలేదని రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు రైతాంగానికి మేలు చేసేలా ప్రణాళికా బద్ధంగా ముందుకు నడుస్తామన్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతల కుటుంబాలకు తామంతా అండగా నిలుస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో వ్యవసాయం దండగ అంటూ అన్నదాతలు పలు ప్రాంతాల్లో వ్యవసాయం చేయకుండా క్రాప్ హాలీడేస్ ప్రకటించిన తీరు తనను ఎంతో బాధించిందన్నారు. మరికొన్ని రోజులు ఓపికగా ఉంటే ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని రాష్ట్రానికి, రైతాంగానికి, అన్ని రకాల వృత్తిదారులకు మంచి జరగబోతుందన్నారు. తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయనాగలక్ష్మి, అన్నాబత్తుని జయలక్ష్మి పలువురు ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సూపర్ 6 పథకాల ప్రచారంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ఐదేళ్లలో తొమ్మిది దఫాలు

కరెంటు చార్జీలు పెంచారు

● ఎన్నికల ప్రచారంలో చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 11: తన ఐదేళ్ల పాలనలో కరెంటు చార్జీలు పైసా కూడా పెంచని చంద్రబాబు కావాలో, తొమ్మిది సార్లు భారీ ఎత్తున విద్యుత్ చార్జీలు పెంచిన జగన్ కావాలో నిర్ణయం తీసుకోవాల్సింది మీరేనని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని మెయిన్ బజారు 17వ వార్డులో ఎన్నికల శంఖారావం, సూపర్ - 6 పథకాల పై ప్రత్తిపాటి ప్రచారం నిర్వహించారు. వ్యాపార వర్గాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సాధికార సారధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి స్థాయిలో కరెంటు బిల్లులు పెంచిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో మరొకరు లేరన్నారు. రాష్ట్రం మొత్తం మీద సగటున ఏడాదికి రూ.10వేల కోట్లకు పైగా కరెంటు చార్జీలు బాదారంటే ప్రజలపై ఏ స్థాయిలో భారం వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి విజయం తప్పనిసరి అని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

పొన్నూరుటౌన్, ఏప్రిల్11: ఇటీవల పొన్నూరు పట్టణంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ రమేష్ బాబు తెలిపారు. గురువారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నిందితుడిని అరెస్టు చూపించారు. ఈ నెల 7వ తేదీన డీవీసీ కాలనీలో యాజలి గోపి హత్యకు గురైయాడు. హత్య కేసులో వల్లపు చైతన్యను అరెస్టు చూపించారు. యాజలి గోపి, చైతన్య మద్యం సేవించి గతంలో ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో గోపి తనను హత్య చేస్తాడని అనుమానించిన చైతన్య మద్యం మత్తులో ఉన్న గోపిని రాయితో చితకబాది హత మార్చినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ టి.భాస్కర్, రాజ్‌కుమార్, రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ భార్గవ్‌లు పాల్గొన్నారు.

రేపు టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే రావి

● చంద్రబాబు సమక్షంలో ప్రత్తిపాడులో చేరేందుకు సన్నాహాలు



రావి వెంకటరమణ

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యులు రావి వెంకటరమణ శనివారం టీడీపీలో చేరనున్నారు. ఇప్పటికే ఆయన యువనేత నారా లోకేశ్‌ను కలిసి పార్టీలో చేరనున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. ప్రజాగళంయాత్రలో భాగంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 13న ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈవేదికద్వారా వెంకటరమణ టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రమణ వైసీపీ పొన్నూరు ఇన్‌చార్జిగా వ్యవహరించి 2014 ఎన్నికల్లో ఆపార్టీ తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించారు. ఆ ఎన్నికల్లో పొన్నూరు నుంచి గెలుపొందిన కిలారి రోశయ్యకు, రమణకు మధ్య సఖ్యత కుదరలేదు. ఇదే సమయంలో ఎమ్మెల్యే రోశయ్య వ్యవహారశైలి నచ్చక వైసీపీలోని ఒక వర్గం అయనపై తిరుగుబాటు చేసింది. అయితే ఈ గొడవలకు రమణను బాధ్యుడిగా చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి ఆయన వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు, పొన్నూరు టీడీపీ అభ్యర్థులు బి.రామాంజనేయులు, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు చొరవ తీసుకొని టీడీపీలో చేరేందుకు ఒప్పించి ముందుగా యువనేత లోకేశ్ వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే తగిన ప్రాధాన్యం ఇస్తామని లోకేశ్ హామీ ఇవ్వటంతో అంగీకరించిన రమణ, చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నారు.



తమ పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పి పార్టీలోనికి చేర్చుకుంటున్న బలసాని, పక్కనే వలంటీర్లు సర్కిల్ చేసిన వ్యక్తులు

వైసీపీలో ఉత్తుత్తి చేర్పులు

● తమ పార్టీ వారికే కండువాలు కప్పి డాబులు
● వైసీపీ అభ్యర్థితో వంగిపురం వలంటీర్లు చెట్టాపట్టాల్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11: తమ పార్టీలోకి పెద్ద ఎత్తున ప్రజలు చేరుతున్నారంటూ వైసీపీ నేతలు బీరాలు పలుకుతున్నారు.. అసలు విషయం ఏమంటే తమ పార్టీ వారికే కండువాలు కప్పి టీడీపీ, జనసేన పార్టీల నుంచి వచ్చారంటూ ఊదర గొడుతున్నారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వంగిపురం గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ నుంచి వైసీపీలో చేరుతున్నట్లు ఫొటోలు వచ్చాయి. ఈ ఫొటోలు చూసిన వంగిపురం గ్రామానికి చెందిన టీడీపీ నియోజకవర్గ తెలుగు యవత కార్యదర్శి శిఖా నవీన్‌తో పాటు పార్టీ నాయకులు బిత్తరపోయారు. ఈ ఫొటోలో కండువాలు కప్పుకుని ఉన్న తిరుమల అబ్రహాం, వంగిపురపు రజనీష్, అద్దంకి వినోద్ కుమార్‌లు తొలి నుంచి వైసీపీలో ఉన్న వారే. వీరిని పార్టీలోనికి చేర్చే ఉత్తుత్తి కార్యక్రమంలో అదే గ్రామానికి చెందిన వలంటీర్లు వరగాని విజయబాబు, వడ్లమూడి గంగరాజు ఉన్నారు. వారిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కామన్ పరీక్షల పేపర్ లీకు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 11: ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 8, 9 తరగతుల కామన్ పరీక్షలకు సంబంధించి పరీక్ష పేపర్‌ను సమాధానాలతో సహా ఓ యూట్యూబర్ లీక్ చేసినట్టు పల్నాడుజిల్లా డీఈవో ఎం.వెంకటేశ్వర్లు 1వ పట్టణ ఎస్ఐకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. బోర్డు సొల్యూషన్ యూట్యూబ్ వారు పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను, వాటి సమాధాన పత్రాలను యూట్యూబ్‌లో వెల్లడించారని, వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మణికంఠ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

పొన్నూరుటౌన్, ఏప్రిల్11: పట్టణ శివారులోని కట్టెంపూడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన బి.జ్యోతి (26) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తోంది. గురువారం ఉదయం వ్యవసాయ పనుల కోసం పొన్నూరు మండలం మంచాల గ్రామానికి ఆటోలో వస్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఆటోను ఢీ కొంది. ప్రమాదంలో ఆటోలో నుంచి జారిపడిన జ్యోతి తీవ్ర గాయాలపాలైంది. గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ జ్యోతి మృతి చెందింది. ప్రమాదంపై రూరల్ పోలీసులు విచారిస్తున్నారు.

బస్సులన్నీ సిద్ధం సభకు..

● 1187 ఆర్టీసీ సర్వీసుల కేటాయింపు
● గురువారం మధ్యాహ్నామే తరలివెళ్లిన వైనం
● నడి ఎండలో ప్రయాణికులకు చుక్కలు..
● ప్రైవేటు వాహనాలే దిక్కు

గుంటూరు, ఏప్రిల్ 11: ముఖ్య మంత్రి జగన్ సేవలో ఆర్టీసీ తరిస్తోంది. ఆయన ఏర్పాటుచేసే సభలంటే చాలు ఆర్టీసీ అధికారులు డిపోల్లో ఉన్న బస్సులను తరలిస్తున్నారు. ఆర్టీసీ అధి కారులు ప్రయాణికుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. సిద్ధం సభ ఎక్కడ జరిగినా అక్కడకు జనాల్ని తరలించేందుకు పెద్ద సంఖ్యలో బస్సులను కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో సీఎం జగన్ పర్యటనలంటేనే సామాన్య ప్రజలతో పాటు ఆర్టీసీ ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. గతవారం నుంచి జరుగుతున్న సిద్ధం సభలకు ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలోని డిపోల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులను కేటాయించారు. దీంతో డిపోల్లో బస్సులు లేక.. ప్రయాణికులు ప్రత్యక్ష నర కాన్ని చవిచూశారు. తాజాగా శుక్ర వారం గుంటూరు సమీపంలోని ఏటు కూరు జాతీయ రహదారి వద్ద జరగనున్న మేమంతా సిద్ధం సభకు సంబంధించి జన సమీకరణ కోసం 1187 బస్సులను సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచే కేటాయిం చిన ఆయా బస్సులు గమ్యస్థానాలకు చేరుకున్నాయి. గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 200 బస్సులు, నెల్లూరు 250, ప్రకాశం 210, పల్నాడు జిల్లా నుంచి 220, బాపట్ల 100, ఎన్టీఆర్ జిల్లా నుంచి మరో 100, కృష్ణా జిల్లా 107 మొత్తం 1187 సర్వీసులను తరలించినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు, మంగళగిరి, తెనాలి, గుంటూరు-1, గుంటూరు-2, తాడికొండ, ప్రత్తి పాడుతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి జన సమీకరణ కోసం ఈ బస్సులను కేటాయించినట్లు సమాచారం. డిపోల్లో ఉన్న పల్లె వెలుగు సర్వీసులన్నీ సిద్ధం సభకు తరలించారు. సామాన్య ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఆర్టీసీ యాజమాన్యం ఏ మాత్రం వెనుకాడటం లేదు.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధానిపై నిందలు వేయటం తగదు

● 1577వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 11: రాజధాని అమరావతికి భూములు త్యాగం చేసిన రైతులను సీఎం జగన్‌రెడ్డి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1577వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ళ వద్ద నుంచి నిరసనలు ఆందోళనలు కొనసాగాయి. పలువురు రైతులు మాట్లాడుతూ అమరావతి రాజధానిని సీఎం జగన్‌రెడ్డి విస్మరించటం తగదన్నారు. జీవనాధారమైన భూములు రాజధాని కోసం ఇచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి రాజధాని అమరావతిని మూడు ముక్కల ఆటతో అభివృద్ధిని అటకెక్కించిదన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.



ఇంద్రప్రస్థం నాటిక బృందానికి బహుమతి అందచేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు

● ఇంద్రప్రస్థం నాటికకు ప్రథమ బహుమతి

యడ్లపాడు, ఏప్రిల్ 11: యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్‌లు సంయుక్తంగా ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటికల పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. 7, 8 తేదీల్లో లింగారావుపాలెంలోని కళావేదికపైన, 9, 10 తేదీల్లో యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపైన పోటీలను నిర్వహించారు. వరుసగా నాలుగురోజులపాటు 11 నాటికలు ప్రదర్శించబడ్డాయి. అంతేగాకుండా నేడు రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాన్ని సూచించిన 'రైతే రాజు' నాటికను ప్రత్యేక ప్రదర్శనగా ప్రదర్శించారు. కళాకారులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాలుగవరోజు పోటీలు ముగిసిన అనంతరం న్యాయ నిర్ణేతలు మల్లాది శివన్నారాయణ, చెరుకూరి సృజన, వినోదబాలలు విజేతల వివరాలను ప్రకటించారు. విజేతలకు అతిథులు రైతు సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, కళాకారులు లక్ష్మీనారాయణ, జరుగుల రామారావు, కళాపరిషత్‌ల నిర్వాహకులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, కట్టా శ్రీహరిరావు, ఎస్.కాళిదాసు, జె.శంకరం, ఎం.పద్మారావు, టి.సాంబశివరావు, కె.వీరాంజనేయులు, ఎం.సీతారామాంజనేయులు తదితరులు బహుమతులను అందజేశారు.


ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

అభినయ ఆర్ట్స్, గుంటూరువారు ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ప్రత్యేక నటుడు బహుమతులను గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు ఆర్ట్స్ థియేటర్స్, వెలగలూరువారి 'రాత' ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోవడంతోపాటు ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళాసమితి, విశాఖపట్నంవారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత.?' నాటిక నిలిచి తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు బహుమతిని నిర్వాహకులు అందచేశారు.

వ్యక్తిగత విభాగంలో.. వ్యక్తిగత విభాగంలో ఉత్తమరచయిత పొలుసుదాసు శ్రీనివాసరావు(రాత), ఉత్తమదర్శకులు ఎన్.రవీంద్రరెడ్డి(ఇంద్రప్రస్థం), ఉత్తమ రంగాలంకరణ పి.బాబూరావు(బంధం), ఉత్తమ సంగీత దర్శకులు పి.రీటా మోహన్ (బంధం), ఉత్తమ ఆహార్యం అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారి 'మనస్విని' నాటికకు లభించాయి. ఉత్తమ నటీనటుల విభాగంలో 5, ఉత్తమ సహాయనటులు విభాగంలో ఐదురికి జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో

భార్యాభర్తలు మృతి



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

వినుకొండటౌన్, ఏప్రిల్ 11: ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీ కొనడంతో భార్యాభర్తలు మృతి చెందగా, ఒకరు గాయపడిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామసమీపంలో గురువారం జరిగింది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన గంగారపురాజు(52), అతని భార్య శివలక్ష్మీ(45), కుమారుడు రాజేష్‌కలిసి గుంటూరు నుంచి స్వగ్రామం నంద్యాలకు బ్యాంకు పనులపై కారులో వెళుతున్నాడు. కొత్తపాలెం సమీపంలో కారు చెట్టును ఢీకొనడంతో గంగారపు రాజు, శివలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా, రాజేష్ కాళ్ల విరిగిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాలను వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను అప్పగించారు.

కారులో నగదు మాయం.. ప్రమాదానికి గురైన కారులో ఉన్న రూ.లక్ష నగదు, మృతురాలి శరీరంపై బంగారు గొలుసు మాయమైనట్లు బంధువులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో దొంగిలించి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.93 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	147, 156,167
చికెన్ విత్ స్కిన్	284.00
చికెన్ స్కిన్ లెస్	294.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



నసీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

నసీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు, నాయకులు

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్‌కు ముస్లిం మైనారిటీ పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నసీర్ మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఎప్పుడు తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని, ప్రస్తుత ప్రభుత్వంలో వాటన్నిటిని తుంగలో తొక్కేశారన్నారు. బీసీలు, మైనార్టీలను గుర్తించింది ఒక్క తెలుగుదేశం పార్టీనేనని, రాబోయే ఎన్నికలో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పనున్నారని చెప్పారు.

కలెక్టరేట్ లీగల్ సెక్షన్‌లో పోస్టల్ బ్యాలెట్ ఫారంలు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవల డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులు, పోలింగ్ తేదీన విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎమర్జన్సీ సర్వీసు డిపార్టుమెంట్లలో ఎంపిక చేసిన నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అత్యవసర డిపార్టుమెంట్‌లైన ఆర్టీసీ, రైల్వే, మెడికల్, విద్యుత్, తపాల తదితర 28 శాఖలలో పోలింగ్ జరిగే మే 13న విధులు నిర్వహించే వారి వివరాలను సంబంధిత నోడల్ అధికారులు పంపించాలన్నారు. ఆ వివరాలను కలెక్టరేట్‌లోని లీగల్ సెక్షన్‌లో అందజేసి ఫారం-12డీలు పొందాలన్నారు. ఆ ఫారంలను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన వారు ఓటు వేసేందుకు ఫెసిలిటేషన్ సెంటర్స్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కేంద్రం వద్ద మాత్రమే ఓటుహక్కు వినియోగించుకొనేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలను త్వరలో తెలియజేస్తామన్నారు.

లలితా హాస్పటల్‌లో పార్కిన్సన్స్ పై అవగాహన



పార్కిన్సన్స్‌పై అవగాహన బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్ విజయ, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 11: ప్రపంచ పార్కిన్సన్స్ దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని లలిత హాస్పటల్ ఆవరణలో న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో పార్కిన్సోనిజం వ్యాధిపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్కిన్సన్స్, ఎమ్‌డీఎస్ క్లినిక్ అనే ప్రత్యేక ఓపీడీ క్లినిక్‌ని ప్రారంభించారు. ఏపీ ఎన్ఎస్ఏ ప్రెసిడెంట్ డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, కారణాలు, చికిత్సలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పార్కిన్సన్స్ వ్యాధికి డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) అనే అధునాతన చికిత్స విధానాన్ని లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్‌లో త్వరలో ప్రారంభిస్తామని చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. అవగాహన కార్యక్రమంలో న్యూరో టీమ్ డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి హాజరై అనేక మంది సందేహాలను నివృత్తి చేశారు.



ఎన్నికల ప్రచారంలో హామీ పత్రాలు అందజేస్తున్న గల్లా మాధవి, మోహనకృష్ణ

మారుతినగర్ అభివృద్ధికి కృషి చేస్తా

● పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతినగర్‌ను, తాను గెలిచిన వెంటనే అభివృద్ధి చేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి హామీనిచ్చారు. నియోజకవర్గంలోని 39వ డివిజన్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి మన్నవ మోహనకృష్ణతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకు న్నారు. అనేక చోట్ల డ్రైనేజి సమస్యల వలన రోగాలు ప్రబలుతున్నా యని, తమను పట్టించుకునే నాధుడే లేరని ప్రజలు ఆమె వద్ద ఆవే దన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సింగంశెట్టి వీరయ్య, రుస్తుంబాబు, శ్రీకాంత్, షేక్ రఫీ, వల్లంశెట్టి వీరయ్య, ఈశ్వర్, మస్తాన్ వలి, బాజీ, వెంకటేశ్వరావు, సుబ్బారావు, ఆరోగ్యరావు, నిరీక్షణ రావు, ప్రభుదాస్, బాల కోటమ్మ, జనసేన అధ్యక్షుడు చేజర్ల శివకుమార్, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు

వినూత్న కథా చిత్రం 'లవ్ మౌళి'

● హీరో నవదీప్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11 : వినూత్న కథనంతో విభిన్న తరహాలో రూపొందించిన చిత్రం 'లవ్ మౌళి' అని ఆ సినిమా హీరో నవదీప్ అన్నారు. ప్రచార యాత్రలో భాగంగా 'లవ్ మౌళి' సినిమా యూనిట్ గురువారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఫీనిక్స్‌మాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరోయిన్లు పంఖురి గిద్వాని, భావన, ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్‌లతో కలిసి హీరో నవదీప్ 'లవ్ మౌళి' సినిమా ట్రైలర్‌ను విడుదల చేసారు. ఈ కార్యక్రమానికి ఈవీవీ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. హీరో, హీరోయిన్లు మాట్లాడుతూ సహజమైన కథతో రూపొందించిన 'లవ్ మౌళి' చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. అనంతరం సినిమా యూనిట్‌ను ఈవీవీ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫీనిక్స్ మహల్ ప్రతినిధులు చైతన్య, నాగరాజు, మైత్రీ మూవీస్ ప్రతినిధులు ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లవ్‌మౌళి సినిమా యూనిట్‌ను సత్కరిస్తున్న వెచ్చా కృష్ణమూర్తి

డయేరియాతో ప్రజలు చనిపోతున్నా పట్టించుకోరా?

● పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి



గీతిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): డయేరియాతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకోరా అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి నిలదీశారు. గుంటూరు నగరంలోని ఆర్ అగ్రహారంలో గురువారం డయేరియాతో చనిపోయిన గీతిక కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ అధికారం కాపాడుకోవటం కోసం జిమ్మికులు చేయటానికి సమయాన్ని వెచ్చిస్తున్న వైసీపీ, ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. గీతిక అనే 21 ఏళ్ల యువతి మరణిస్తే పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రజని ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి కూడా ఇంతటి దారుణం జరిగినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామని, రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాంబ, ఎస్.శ్రీనివాసరావు, డివిజన్ నేతలు పాల్గొన్నారు.

శ్యామలానగర్ పార్కు పరిశీలన

గుంటూరు 36వ డివిజన్ శ్యామలనగర్ పార్కును గురువారం ఉదయం గల్లా మాధవి పరిశీలించారు. వాకర్స్‌తో ముచ్చటించి, పార్కు నిర్వహణ, ప్రజలకు కావాల్సిన వసతులపై ఆరా తీశారు. అధికారంలోకి వస్తే వాటిని కల్పించేందుకు కృషి చేస్తామని మాధవి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బండారు రాధికా, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త మహాత్మ పూలే

సమాజంలో అంటరాన్నితనాన్ని నిర్మూలించి, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్పూర్తి ప్రదాతగా నిలిచిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావుపూలే అని గల్లా మాధవి అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా నియోజకవర్గ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె ఘనంగా నివాళులరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ జిల్లా కార్యాలయంలో...

మహాత్మా జ్యోతిరావ్‌పూలే బాటలో నడిచే టీడీపీతోనే బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ నేతృత్వంలో పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గల్లామాధవి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గల్లా మాధవి మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యత ఇంతవరకు ఏ పార్టీలోనూ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిమ్న వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని అన్నారు. కార్యక్రమంలో మద్దిరాల ఇమ్మానుయేల్, దాసరి రాజా మాస్టారు, సుఖవాసి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, అడక శ్రీనివాసరావు, మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, దామచర్ల శ్రీనివాసరావు, మాదాల చినకొండలరావు, పాటిబండ్ల బలరాం, మల్లెంపూడి శ్రీనివాసరావు, గొడుగు శంకర్, జంపని నాగేశ్వరరావు, కసుకుర్తి హనుమంతరావు, వకుళాదేవి, టి.పద్మావతి, పున్నారావు, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంస్కరణలకు నాంది జ్యోతిరావు పూలే

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, జేసీ

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంస్కరణల నాందికర్త, మహిళల విద్యాభివృద్ధి రూపకర్త మహాత్మా జ్యోతిబా పూలే చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే నిస్వార్ధంగా చేసిన సేవలను, ఆశయాలను భావితరాలకు అందించటమే ఆయనకు మనం అందించే ఘన నివాళి అని తెలిపారు. సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ప్రసంగించారు. కలెక్టరేట్ ఎల్ సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మయ్య మహాత్మా జ్యోతిబా పూలే జీవిత విశేషాలు, ఆశయాలు, సంస్కరణల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి టి.వెంకటేశ్వర్లు, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జిల్లా జౌళి శాఖ ఏడీ వనజ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, కలెక్టరేట్ కార్యాయల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనా పోరాట పితామహుడు మహాత్మాపూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుల నిర్మూలనా పోరాటాల పితామహుడు, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన పోరాట యోధుడు మహాత్మా జ్యోతిరావ్‌పూలే అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ కొనియాడారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని గురువారం ఆయన ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధారకు జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. సామాజిక న్యాయం మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే అన్నారు. జ్యోతిరావుపూలే మార్గంలోనే తాము ప్రయాణిస్తున్నట్లు మన్నవ మోహనకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నకొండలరావు, 18వ డివిజన్ బీసీ నాయకుడు మల్లెల కిషోర్, 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పచ్చ వెంగయ్య, 36వ డివిజన్ మాజీ అధ్యక్షుడు నూలుపూరి శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ బాజీ, గుంటుపల్లి గురవయ్య, చావల అప్పారావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి బీసీ ఈఎఫ్ ఘన నివాళి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 11 : బీసీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావ్‌పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కూడలిలోని పూలే సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి శివపూర్ణయ్య, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు సాదం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు, నగర శాఖ అధ్యక్షులు వరికల్లు శ్రీనివాసరావు, బీసీ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థపై తిరుగుబాటు చేసిన తొలి మహనీయుడు పూలే

గుంటూరు, ఏప్రిల్ 11: సమాజంలో అనాదిగా వస్తోన్న కుల వ్యవస్థపై తిరుగుబాటు చేసిన తొలి మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం గుంటూరు హిందూ కాలేజి సెంటర్‌లో పూలే విగ్రహానికి మంత్రి రజిని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలానే చంద్రమౌళినగర్‌లోని వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి మంత్రి రజిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీవీఐటీ ఇంజనీరింగ్ కళాశాల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బొల్లేపల్లి సత్యనారాయణలను మంత్రి రజనీ మర్యాదపూర్వకంగా కలిసి అండగా నిలవాలని కోరారు.

● ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు, సంఘం యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, సంఘం నేతలు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లూరు హనుమంత రావు, కోలా అశోక్, తిరుపతిరావు, సుబ్రహ్మణ్యం హిందూ కళాశాల సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూల మాలలతో ఘన నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీభవన్‌లో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు పూలే చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన శంకరరావు, క్రాంతికుమార్ తదితరులు

పూలే విగ్రహానికి బీజేపీ నేతల నివాళి

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి పార్టీ జిల్లా, నగర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అట్టడుగు కులాల ప్రజలకు సమానమైన హక్కులు సాధించడంలో ప్రధాన పాత్ర వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర పదాధికారి కొక్కెర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, జగ్గారావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11 : సమస్త మానవవాళికి ఆదర్శ ప్రాయుడు శ్రీరామచంద్రుడని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కేవీ శ్రీరంగనాయకి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం సంక్షిప్త రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రీరంగనాయకి ప్రవచిస్తూ శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుల వారి కథను వివరించారు. సుందరాకాండలోని ఆంజనేయస్వామి నిర్వహించిన కార్యక్రమాలను రావణ వధ విశేషాలను వివరించారు.



ప్రవచనం చేస్తున్న డాక్టర్ కేవీ శ్రీరంగనాయకి

కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

జగన్‌రెడ్డిని చూసి ఊసరవెల్లి సిగ్గు పడుతుంది

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పల్నాడు సిద్ధం సభలో జగన్‌రెడ్డి మాటలు చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గుణగణాలపైనా, ఆయన కుటుంబ చరిత్రపైనా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. జగన్ తాత ఒక రౌడీషీటర్, తండ్రి ఒక ఫాక్షనిస్టు, ఇతనొక కరుడుగట్టిన ఆర్థిక నేరస్తుడని మండిపడ్డారు. వైఎస్ కుటుంబానికి, చంద్రబాబు కుటుంబానికి పోలికేలేదని ఆదిశంకరాచార్యుడికి, ఆటో శంకర్‌కు ఉన్నంత తేడా ఉందన్నారు. సున్నపురాయి, బైరెటీస్ గనుల ను దోచుకొని, వాటాలకోసం భాగస్వామ్యులను హత్యచేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిదని అన్నారు. ఎమ్మెల్యే పదవి కోసం నాడు తండ్రి రాజశేఖరరెడ్డి ఇందిరాగాంధీకి వెన్నుపోటు పొడిచి రెడ్డి కాంగ్రెస్‌లో చెరితే, నేడు సీఎం పీఠంకోసం సోనియాగాంధీకి వెన్నుపోటు పొడి చిన చరిత్ర జగన్‌రెడ్డిదని విమర్శించారు. పదే పదే సభల్లో జగన్ మీ బిడ్డ, మీ బిడ్డ అంటుంటే ప్రజలు ఛీ కొడుతున్నారని, ఇలాంటి హంతక, అవినీతి, అరాచక బిడ్డ మాకొద్దని మహిళలు శాపనార్థాలు పెడుతున్నారని అన్నారు. సొంత బాబాయిని తమ్ముళ్లచేత అతి కిరా తకంగా హత్య చేయించి, తల్లీ- చెల్లెళ్లను తన్ని తరిమేసిన అభినవ కిమ్ జగన్ అని విమర్శించారు. సమావేశంలో ఎస్సీ నాయకులు యర్రగుంట్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని గెలుపునకై ప్రచార యాత్ర



మాట్లాడుతున్న కే.ఆనంద్‌బాబు, పాల్గొన్న జనం పార్టీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11 : గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని గెలుపు కోసం జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర చేపడుతున్నట్లు రాష్ట్రీయ మహాజన సమితి, జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి ఆనంద్‌బాబు తెలిపారు. వైసీపీని ఓడించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ప్రచారం కార్యక్రమంలో భాగంగా అరండల్‌పేట, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రలో భాగంగా ఏడు నియోజకవర్గాల్లో పర్యటించి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తామని వివరించారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు, మైనార్టీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన మేధావులు, దళిత నాయకులు మేల్కొని దళిత వ్యతిరేకైన జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. సమావేశంలో రాష్ట్రీయ మహాజన సమితి నాయకులు పిల్లి రాంబాబు, జనం పార్టీ నాయకులు రత్నంరాజు, బండి అమర్, రాజ్‌కుమార్, శివకృష్ణ, రోశయ్య, సాల్మన్‌రాజు, ఏకలవ్య సెప్టిక్ ట్యాంకర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 11: కాకాని రోడ్డులోని డి 13 సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారామనగర్, ఎన్‌టీఆర్ నగర్, వంగళదాస్‌నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. అలానే రామన్నపేటలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ తెలిపారు.



నగరంపాలెంలో రంజాన్ సందర్భంగా ప్రార్థనలకు హాజరైన వారికి సందేశం ఇస్తున్న మత గురువు



ఆంధ్ర ముస్లిం కళాశాలలో రంజాన్ సందేశం ఇస్తున్న మత గురువు ముఫ్తీ జావిద్ సాబ్



నగరపాలెంలోని ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



ప్రార్థనలో పాల్గొన్న చిన్నారులు

దిక్సూచి
DIKSUCHI

యూపీఎస్సీ ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ 2024

ఎకనామిక్స్/స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఇండియన్ ఎకనామిక్ సర్వీస్/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను యూపీఎస్సీ నిర్వహిస్తోంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు చొప్పున మొత్తం 48 పోస్టులు ఉన్నాయి.

అర్హత: ఎకనామిక్ సర్వీస్‌కు పీజీ(ఎకనామిక్స్/అప్లయిడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్); స్టాటిస్టికల్ సర్వీస్‌కు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

పరీక్ష వివరాలు

- ఇందులో రాత పరీక్ష, వైవా-వోస్ అనే రెండు పార్ట్‌లు ఉంటాయి. రాత పరీక్షకు 1000 మార్కులు, వైవాకు 200 మార్కులు నిర్దేశించారు.
- ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు; జనరల్ ఎకనామిక్స్-1, జనరల్ ఎకనామిక్స్-2, జనరల్ ఎకనామిక్స్-3 సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు నిర్దేశించారు. ఒక్కో సబ్జెక్టుకు 3 గంటల సమయం ఇస్తారు.
- ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం కేటాయించారు. స్టాటిస్టిక్స్-1(ఆబ్జెక్టివ్), స్టాటిస్టిక్స్-2(ఆబ్జెక్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, రెండు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు. స్టాటిస్టిక్స్-3(డిస్క్రిప్టివ్), స్టాటిస్టిక్స్-4 (డిస్క్రిప్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200(మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ఎగ్జామ్ తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JesXJhJలో చదవండి.

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ మోడల్ ప్రశ్నలు

తెలుగు కంటెంట్ & మెథడాలజీ

1. 'భార్య' పదానికి పర్యాయపదాలు గుర్తించండి
   1) సతి 2) కళత్రం 3) దార 4) పైవన్నీ
2. 'అంగం' పదానికి నానార్థాలు ఎన్నుకోండి
   1) అవయవం 2) భాగం
   3) శరీరం 4) పైవన్నీ
3. 'ప్రాణులకు జీవనాధారమైనవాడు' అనే వ్యుత్పత్తినిచ్చే పదం?
   1) అనంతుడు 2) అనిహుడు
   3) అనీశుడు 4) అనిలుడు
4. పుట్టెడు శనగల్లో ఒకటే రాయి? ఈ పొడుపునకు విడుపు?
   1) సీతాఫలం 2) చుక్కల్లో చంద్రుడు
   3) అగ్గిపెట్టె 4) ఆకాశంలో నక్షత్రం
5. కింది వాటిలో సర్వనామాన్ని గుర్తించండి
   1) మేము 2) లత 3) చెట్టు 4) బడి
6. క నుంచి మ వరకు ఉన్న హల్లులకు గల పేరు?
   1) స్పర్శాలు 2) స్థిరాలు
   3) ఊష్మాలు 4) సరళాలు
7. కింది వాటిలో ఉపవిభక్తులు అని వేటిని అంటారు?
   1) ఇ, టి, తి 2) య, వ, ర
   3) అ, ఈ, ఏ 4) పైవన్నీ
8. వధూపేతుడు పదాన్ని విడదీయగా వచ్చిన రూపం
   1) వధు + ఉపేతుడు
   2) వధు + ఊపేతుడు
   3) వధూ + ఊపేతుడు
   4) వధూ + ఉపేతుడు
9. కింది వాటిలో ద్విగు సమాసాన్ని గుర్తించండి
   1) ఏడు ద్వారాలు 2) మూడు కన్నులు
   3) పంచ పాండవులు 4) పైవన్నీ
10. మండే ఎండ నిప్పుల కొలిమా? అన్నట్లు ఉంది- ఇందులో ఉన్న అలంకారాన్ని గుర్తించండి
    1) ఉపమాలంకారం 2) యమకాలంకారం
    3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్షాలంకారం
11. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి
    1) సమ్యక్‌దృష్టి- UUUI
    2) కారకముల్- UIIU
    3) చదువుచున్- IIIIU
    4) మర్కటము- UIII
12. సమప్రాధాన్యం గల రెండు గాని అంతకంటే ఎక్కువ వాక్యాలు కాని కలిస్తే వాక్యం ఏర్పడుతుంది
    1) సామాన్య వాక్యం 2) సంయుక్త వాక్యం
    3) సంశ్లిష్ట వాక్యం 4) సంక్షిప్త వాక్యం
13. భావితరాల వారికి మన భావాలను అందించేందుకు సమస్యలను పది మందికి తెలిసేలా పత్రికల్లో ప్రచారం చేసేందుకు అవసరమయ్యే నైపుణ్యం?
    1) లేఖనం 2) పఠనం
    3) భాషణం 4) శ్రవణం
14. కిండర్ గార్టెన్ పద్ధతిని ప్రవేశపెట్టిన విద్యావేత్త?
    1) బ్లూమ్ 2) కాల్డ్‌వెల్
    3) ఫ్రోబెల్ 4) గలిక్
15. విద్యాపరంగా ఊహాజనిత సుదూర గమ్యాలు?
    1) విద్యాదర్శాలు 2) విద్యోద్దేశాలు
    3) విద్యాలక్ష్యాలు 4) విద్యాస్పష్టీకరణలు
16. ప్రథమ భాషగా తెలుగు బోధనోద్దేశం?
    1) భాషా సంస్కృతిని, భాషీయుల సంస్కృతిని పరిచయం చేయడం
    2) శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలను పెంచి భాషపై పట్టు కలిగించడం
    3) శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలకు కావాల్సిన సాధారణ పరిజ్ఞానం కలిగించడం
    4) దైనందిన వ్యవహారాలను తెలుగులో నిర్వహించే జ్ఞానం ఉండడం
17. పద్య బోధన ప్రధాన ఉద్దేశం?
    1) భాషా సంపదను పెంపొందించడం
    2) విద్యార్థుల్లో రసానందాన్ని కలిగింపజేయడం
    3) భాషలోని నుడికారాన్ని తెలుసుకునేటట్లు చేయడం
    4) విషయ పరిజ్ఞానానికి తోడ్పడడం
18. విద్యా సాంకేతిక శాస్త్రం అనే భావనను మొదట ప్రవేశపెట్టింది?
    1) డేవిడ్ టేలర్ 2) చార్లెస్ బాబేజ్
    3) ఎడ్గార్ డేల్ 4) బోస్టన్
19. 'భాషామేళాలు' పాఠశాలల్లో నిర్వహించడం వలన కలిగే ప్రయోజనం?
    1) పాఠశాల కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించుట
    2) పాఠశాల కీర్తి ప్రతిష్ఠలు పెంచుట
    3) విద్యార్థుల్లో భాషాభివృద్ధి జరుగుట
    4) ఉపాధ్యాయుల నైపుణ్య పరీక్షణం
20. విద్యార్థులను సమగ్రంగా మూల్యాంకనం చేయాలని అలాగే వారి యోగ్యతా పత్రాల్లో విద్యార్థులు ఉత్తీర్ణులా, అనుత్తీర్ణులా అనే అంశం ఉండకూడదని సూచించిన కమిషన్?
    1) మొదలియార్
    2) కొఠారీ
    3) ఈశ్వరీభాయి పటేల్ కమిటీ
    4) రాధాకృష్ణన్

ఇంగ్లీష్ కంటెంట్ & మెథడాలజీ

21. Match following Poet/Author with their Poem/Lesson

Poet/Author	Poem/Lesson
1. T.S.ELIOT	a) Bepin Chaudhury's Lapse of Memory (Lesson)
2. SATYAJIT RAY	b) The Lat Bargain(poem)
3. RABINDRANATH	c) The Summit TAGORE Within (Lesson)
4. H.P.S.AHLUWALIA	d) Macavity: The Mystery Cat(Poem)

   1) 1-d, 2-c, 3-b, 4-a 2) 1-c, 2-a, 3-d, 4-b
   3) 1-d, 2-a, 3-b, 4-a 4) 1-b, 2-c, 3-d, 4-a
22. When was Frank Flynn born?
   1) 16 November 1906 2) 6 December 1906
   3) 26 October 1916 4) 16 October 1916
23. Which of the following were written by William Griffis?
   a) Dutch Fairy Tales for Young b) Belgian Fairy Tales
   c) Welsh Fairy Tales d) The Malkado's Empire
   e) Corea:The Hermit Nation
   1) a, b, c 2) b, c, d 3) a, b, d, e 4) a, b, c, d, e
24. Techniques can be used in note making......
   1) Use abbreviations 2) Use color and image
   3) Use keywords 4) all above
25. What is a 'Biography'?
   1) A Life story written by another person
   2) A Life story that tells the life of some persons
   3) A self-written life story
   4) A life story made into film by the person him/herself
26. Mrs. Sudha Murthy the chairperson of Infosys has written her husband Narayana Murthy's life story. What type of book is it?
   1) Biography 2) Travel Book
   3) Autobiography 4) Memoir
27. Choose the noun phrase with the correct order of adjectives
   1) A dirty black crow 2) A crow dirty black
   3) A crow black dirty 4) A black dirty crow
28. Choose the correct expression with the correct order of adjectives
   1) A silk nice saree 2) A nice silk saree
   3) A saree nice silk 4) A silk saree nice

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 2 5) 1 6) 1
7) 1 8) 4 9) 4 10) 4 11) 3
12) 2 13) 1 14) 3 15) 1 16) 2
17) 2 18) 1 19) 3 20) 2 21) 3
22) 2 23) 4 24) 4 25) 1 26) 1
27) 1 28) 2



ఆకిశెట్టి వెంకటస్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ

హీరో రామ్ చరణ్‌కు 'గౌరవ డాక్టరేట్'



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హీరో రామ్‌చరణ్‌కు చెన్నైలోని వేల్స్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. చిత్రపరిశ్రమతో పాటు సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్టు వేల్స్ విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 13 సాయంత్రం 4 గంటలకు చెన్నై పల్లావరంలోని వేల్స్ క్యాంపస్‌లో జరిగే యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ పాల్గొని ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు. ఈ స్నాతకోత్సవంలో రామ్ చరణ్‌తో పాటు చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.వీరముత్తువేల్, త్రివిట్రన్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ పద్మశ్రీ శరత్ కుమల్ అచంటలకు కూడా ఈ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వేల్స్ యూనివర్శిటీ చాన్సెలర్ డాక్టర్ ఐసరి కె.గణేశ్ అధ్యక్షత వహించనున్నారు.

వార్‌కు రెడీ



జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2' సెట్స్‌లోకి అడుగుపెట్టారు. గురువారం ముంబైలో ఆయన తన పాత్రకు సంబంధించిన షూటింగ్ మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇందులో ఎన్టీఆర్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. హీరోగా ఆయనకు ఇది తొలి హిందీ చిత్రం. వచ్చే ఏడాది ఆగస్టు 15న 'వార్ 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. 'వార్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో హృతిక్‌రోషన్ మరో హీరోగా నటిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

40 ఏళ్ల తర్వాత...



40 ఏళ్ల తర్వాత ఓ భారతీయ చిత్రం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 'ఆల్ వుయ్ ఇమాజిన్ ఆజ్ లైట్' అనే చిత్రం ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనే అత్యంత ఉన్నత పురస్కారమైన 'గోల్డెన్ పామ్'కు పోటీపడుతోంది. మెయిన్ సెగ్మెంట్‌లో ఎంపికై అవార్డు రేసులో ఉన్న ఈ చిత్రాన్ని భారతీయ దర్శకుడు పాయల్ కపాడియా తెరకెక్కించారు. కేన్స్ చిత్రోత్సవ అధ్యక్షుడు, ఐరిస్ నాబ్‌లోచ్ గురువారం ఫ్రాన్స్‌లో జరిగిన ఓ లైవ్ మీడియా కాన్ఫరెన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వివిధ కేటగిరీల్లో ప్రదర్శనకు ఎంపికైన చిత్రాలను ప్రకటించారు. ఇందులో భారత సంతతికి చెందిన బ్రిటీష్ ఫిల్మ్ మేకర్ సంధ్య సూరి చిత్రం 'సంతోష్' మరో కేటగిరిలో ఎంపికైంది. ఫిల్మ్ మేకింగ్‌లో దిగ్గజాలైన 19 మంది విదేశీ దర్శకుల చిత్రాలతో పాటు 'ఆల్ వుయ్ ఇమాజిన్ ఆజ్ లైట్' చిత్రాన్ని మే 14 నుంచి 25 మధ్యన ప్రదర్శిస్తారు. 2021లో పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' డాక్యుమెంటరీ, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గోల్డెన్ ఐ అవార్డును గెలుచుకోవడం విశేషం. 'ఆల్ వుయ్ ఇమాజిన్ ఆజ్ లైట్' చిత్ర కథాంశం ఇద్దరు మహిళా నర్సుల జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల చుట్టూ తిరుగుతుంది. కాగా, చివరిసారిగా 1983లో మృణాల్‌సేన్ దర్శకత్వం వహించిన ఖర్జీ చిత్రం ఈ కేటగిరీలో పోటీపడింది.

బ్యాంక్ క్యాషియర్ కహానీ



వివిధ భాషల్లో విభిన్న చిత్రాలు చేస్తూ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను రంజాన్ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ క్యాషియర్‌గా ఇంతకుమునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ కనిపించారు. ఒక సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి ఎలా చేరుకున్నాడు అనే ఆసక్తిని రేకెత్తిస్తూ రూపొందించిన టీజర్ ఆకట్టుకుంటోంది. టీజర్‌లో దుల్కర్ పలికిన సంభాషణలు, ఆసక్తిని పెంచుతున్నాయి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి, ఎడిటింగ్: నవీన్ నూలి,

విశ్వం.. విధ్వంసం



కల్యాణ మండపంలో పెళ్లి జరుగుతోంది. పురోహితుడు పెళ్లి మంత్రాలు చదువుతున్నాడు. వాద్య బృందం రకరకాల వాయిద్యాలతో సందడి చేస్తోంది. మరో పక్క విందు కోసం రుచికరమైన ఆహార పదార్థాలను చెఫ్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇంతలో గిటార్ బ్యాగ్‌ని భుజాన వేసుకుని అక్కడికి వచ్చాడు. ఒక చోట ఆగి ఆ బ్యాగ్ ఓపెన్ చేశాడు. అందులోంచి గిటార్‌ను కాదు.. మెషిన్ గన్‌ను తీసుకుని వధువరులతో సహా అందరినీ కాల్చడం ప్రారంభించాడు. వాళ్లంతా నేలకు ఒరిగిన తర్వాత అక్కడి ఫుడ్‌ని ఆస్వాదిస్తూ 'దానే దానే పే లిఖా .. ఖానే వాలే కా నామ్.. ఇస్సే లిఖా మేరా నామ్' అన్నాడు. ఎవరతను? పెళ్లిమంటపంలో ఎందుకీ విధ్వంసం సృష్టించాడు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'విశ్వం' అని పేరు పెట్టి విడుదల చేసిన ఫస్ట్ స్ట్రైక్ వీడియోలో మాటర్ ఇది. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: గుహన్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి.



ఈ ప్రచారాన్ని.. అరికట్టాల్సిందే!

తెలుగు సినీ పరిశ్రమలోని అగ్రనిర్మాతల్లో దిల్‌రాజు ఒకరు. ఇటీవల ఆయన నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా విడుదలయింది. చాలా ప్రాంతాల్లో సినిమా చూసి ఎంతో మంది బాగుందన్నారు. కానీ సినిమా విడుదలకు ముందే కొన్ని యూట్యూబ్ రివ్యూలు వచ్చేశాయి. సినిమా బాగోలేదనే ప్రచారం విస్తృతంగా జరిగింది. ఈ కారణంగా సినిమా ఓపెనింగ్స్ దెబ్బ తిన్నాయి. దీంతో దిల్‌రాజే స్వయంగా మైక్ పట్టుకొని- 'పబ్లిక్ ఓపినియన్' అడిగి సోషల్ మీడియాలో పెట్టారు. తమను కావాలని టార్గెట్ చేశారని- ఫ్యామిలీ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మేనేజర్ అనురాగ్ పర్వతనేని పోలీసు కేసు పెట్టారు. ఒక సినిమా జయాపజయాలను ప్రభావితం చేసే శక్తి సోషల్ మీడియాకు ఉందా? ఎవరైనా కావాలని సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తే ఏం చేయాలి? ఈ అంశాలపైనే ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. (పూర్తి కథనం ఈ - పేపర్‌లో)

దాసరి పురస్కారాలు



ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన పేరిట పురస్కారాలు ఇవ్వడానికి దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, నిర్మాత సి. కల్యాణ్, బీఎస్ఎన్ సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పడింది. మే 5న శిల్ప కళావేదికలో దాసరి నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. 'దర్శకరత్న డి.ఎన్.ఆర్ ఫిల్మ్ అవార్డ్స్' పేరుతో పురస్కారాలు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. పలు విభాగాల్లో విశేష కృషి చేసిన సినీ ప్రముఖులను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తామని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MYAMblh లో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఘనంగా శ్రీరామ నవమి నవరాత్రి మహోత్సవాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11: పట్టణంలోని రామాలయాలలో నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్ శ్రీసీతారామ మందిరంలో గురువారం నిత్య శాంతి కల్యాణంలో భాగంగా స్నేహ, సాయితరుణ్ దంపతులు, శ్రీనివాస్ దంపతులు కల్యాణం జరిపించారు. ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం నరసింహాచార్యులు పర్యవేక్షించారు. కంచికామకోటి ఆస్థాన పండితులు ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి, శ్రీమద్‌రామాయణం పురాణోపాన్యాసం చేశారు. హైదరాబాద్ కళాకారులు వారణాసి శ్రీకృష్ణ రాఘవ వయోలిన్ వాయిద్యా కచేరీ నిర్వహించారు. కె.రామకృష్ణ, అనీల్ వాయిద్యా సహకారం అందించారు. శ్రీసీతారామ అన్నదాన సేవా సంఘం సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. నాజరుపేటలోని సీతారామ మందిరంలో 40వ వసంత నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

వైసీపీ ప్రభుత్వం ముస్లింలకు చేసింది ఏమీ లేదు

● నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 11: వైసీపీ పాలనలో ముస్లిం సోదరుల అభ్యున్నతికి చేసిందేమీ లేదని పైగా టీడీపీ హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలను సైతం నిలిపివేసి వారిపైనే దాడులకు కూడా వెనుకాడలేదని ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిందరికీ మంచి జరిగేలా పాలన ఉంటుందని ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గామైదానంలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో మనోహర్ పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



తెనాలి క్రైం, ఏప్రిల్ 11: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు తెనాలి రైల్వే పోలీసులు గురువారం తెలిపారు. తెనాలి-విజయవాడ ప్రధాన మార్గంలో దుగ్గిరాల-చిలుమూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయస్సు 45-50 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు ఒంటిపై బనియన్, లుంగీ మాత్రమే ఉన్నాయని, మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

తెనాలి క్రైం, ఏప్రియల్ 11: పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఇద్దరు ఇద్దరు చొప్పున, కార్యదర్శి పదవికి ముగ్గురు పోటీలో ఉన్నారు. బార్ అసోసియేషన్ 403మంది సభ్యులున్నారు. ఎన్నికల అధికారులు సీహెచ్ మైకేల్, ఎం.బాబావలి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11: రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు ప్రారంభించారు. బీసీ సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆరాధ్యుల శివ, కరేటి రవి, వెంకటేశ్వరరావు, నరసయ్య, బీష్మా పాములు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసు దళాలు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: సీఐ

తెనాలి క్రైం, ఏప్రిల్ 11: పట్టణ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఒన్‌టౌన్ సీఐ దశరథ రామారావు సూచించారు. గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఓటుహక్కు, వినియోగం గురించి వివరిస్తూ పోలీసు దళాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు.

నిబంధనలు పాటించండి: రూరల్ ఎస్ఐ

తెనాలి రూరల్, ఏప్రిల్ 11: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని నందివెలుగు కూడలి వద్ద గురువారం ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహనాలపై ఏటువంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు ఉండకూడదన్నారు. రూ.50వేలుకు మించి తీసుకువచ్చేవారు తప్పనిసరిగా ఆ సొమ్ముకు సంబంధించిన రసీదులు వెంట తీసుకురావాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఎస్ఐ పేర్కొన్నారు. స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ తీరంలో బీటెక్ విద్యార్థి గల్లంతు



తేజస్ (ఫైల్‌ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 11: రుషికొండ తీరంలో సముద్ర స్నానానికి దిగిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న జి.సృజన్, జి.హర్ష, వై. వంశీ, ఎస్ సాయి వెంకట్, పి.ప్రణీత్, తేజస్ (20) రంజాన్ సెలవు కావడంతో గురువారం ఉదయం రుషికొండ బీచ్‌కు విహారయాత్రకు వచ్చారు. వారంతా సంపత్ వినాయక్ గుడి వద్ద ఉన్న ఎంసెట్ కళాశాలలో ఇంటర్ కలిసి చదువుకున్నారు. ఈ మేరకు బీచ్‌కు విహారానికి వచ్చిన వారు సరదాగా కాసేపు తీరంలో విహరించి, అనంతరం సాయిప్రియా రిసార్ట్స్ వెనుక ఉన్న తీరంలో స్నానాలకు దిగారు. కేరింతలు కొడుతూ... స్నానాలు చేస్తుండగా ఓ రాకాసి అల తాకిడికి తేజస్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. కళ్ల ఎదుటే మిత్రుడు కెరటాల్లో కొట్టుకుపోతుండడాన్ని చూసి మిగిలిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో పెద్దగా కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు వచ్చారు. అప్పటికే తేజస్ సముద్రంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ గోవిందరావు పర్యవేక్షణలో బ్లూకోర్టు పోలీసులు గల్లంతైన విద్యార్థి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజస్ (20) అమరావతి విట్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఈసీఈ చదువుతున్నాడు. తండ్రి కేఎల్ యూనివర్సిటీలో లెక్చరర్. తల్లి గృహిణి.

గతంలో ఆరుగురు మృతి

సాయిప్రియా రిసార్ట్స్ వెనుక ఉన్న తీరంలో స్నానాలకు దిగి గతంలో ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. అప్పట్లో ఈ సంఘటన నగరవాసుల ను కలచివేసింది. అలాగే రష్యన్ శాస్త్రవేత్త, గజ ఈతగాడు కూడా ఇదే ప్రాంతంలో మృతి చెందారు. ఈ ప్రాంతంలో కెరటాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఎంత ఈత వచ్చినా గల్లంతు కాకతప్పదు. ఇక్కడ సముద్ర స్నానాలు చేయడం నిషేధం, లైఫ్ గార్డులు, పోలీసులు పదే పదే హెచ్చరికలు చేస్తున్నా.. సందర్శకులు పెడచెవిన పెట్టి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు.

తుమ్మల సాహిత్యం వెలకట్టలేనిది

● సాహితీ వేత్త డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 11: ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి పాత్ర విశేషమైనదని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు కొనియాడారు. ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో గురువారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై తుమ్మల కర్షక సాహిత్యం గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సభకు ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, తుమ్మల కళాపీఠం కార్య దర్శి సూర్యదేవర రవికుమార్ గ్రంథావిష్కరణ గావించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బీరం సుందర రావు మాట్లాడుతూ తుమ్మల కర్షక సాహిత్యంలో సగటు రైతు జీవనం, వారి వ్యధలను కళ్లకుకట్టినట్టు వివరించారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వికాస్ విద్యాసంస్థల అధినేత పీవీ శంకరరావు మాట్లా డుతూ తుమ్మల కర్షక సాహిత్యం గ్రంథాన్ని వెలుగులోకి తీసుకురావడానికి జక్కంపూడి సీతారామారావు కృషి గొప్పదని కొనియాడారు. అంచె విజయలక్ష్మి సభకు స్వాగతం పలుకగా కార్యక్రమంలో అమరావతి సాహితీ మిత్రులు వ్యవస్థాపకులు రావి రంగారావు, వి.నాగరాజ్యలక్ష్మి, ఎన్జీ రంగా ఫౌండేషన్, తుమ్మల కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేయాలి

● గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్



రోడ్డుషోలో పాల్గొన్న నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

కొల్లిపర, ఏప్రిల్ 11: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని అత్తోట, అత్తోట యాదవపాలెం, కుంచవరం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నందివెలుగు నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికి గజమాలతో ఇద్దరు నాయకులను సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, ఎన్నికల ముందు రాజధాని ఇక్కడే ఉంటుందని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసన సభ్యుడిగా పనిచేసినప్పుడు తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపానన్నారు. అట్టడుగు స్థాయిలో ఉండి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీరోడ్లు వేసి రూపరేఖలు మార్చినట్లు తెలిపారు. అరాచపాలన నుంచి విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఎంపీ అభ్యర్థిగా చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. రోడ్ షోలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వంగా సాంబిరెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, దివ్వెల ఏడుకొండలు, దాసరి నరసయ్య, కొతారు అంజనేయులు, ముంగర బుల్లికోటయ్య తదితరులు పాల్గొన్నారు.



కాలనీ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజలందరికీ మంచి చేసేందుకే వచ్చా: పెమ్మసాని

తెనాలి రూరల్, ఏప్రిల్ 11: ప్రజలందరికీ మంచి చేసేందుకు మీముందుకు వచ్చానని, మీ కుటుంబంలో ఒకడిగా ఆదరించి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నన్ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గెలిపించాలని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. గురువారం పట్టణంలోని మూడో వార్డులోని ఏకలవ్యనగర్‌లో ఆ ప్రాంత నివాసులతో ఉమ్మడి పార్టీల అభ్యర్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రూ.5-10వేలు ఇచ్చినంత మాత్రాన ప్రజల జీవన విధానం మారదన్నారు. వారే స్వయంగా సంపాదించుకుని పైస్థాయికి వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం సంక్షేమం పేరుతో డబ్బులు పంచుతూ ప్రజలకు అవసరమైన నిత్యవసరాల ధరలను పెంచి వారి నుండే ముక్కుపిండి వసూలు చేస్తూ మోసపూరిత పాలనకు తెరలేపించదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమంతో ఏ ఒక్క కుటుంబమైన అభివృద్ధి చెందిదా.. సంతోషంగా ఉన్నారా.. కుటుంబ పెద్దలకు ప్రతి రోజు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయా... ఇవ్వనీ ప్రజలందరూ ఆలోచించాల్సి ఉందన్నారు. కేవలం జగన్ ప్రభుత్వం ప్రజలను బానిసలను చేసి ఓట్ల రాజకీయానికి తెరలేపిందని అందుకు పేదల సంక్షేమం అనే ముసుగు ధరించి అదే పేదల కుటుంబాల్లో సంపాదన లేకుండా చేసి దుర్మార్గపు పాలనకు తెరలేపిందన్నారు. గత ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి వారి కోసం టిడ్కో ఇల్లు కట్టించి వారికి గూడు కల్పించాలని చంద్రబాబు ఎంతో తపించాడని ఈ ప్రభుత్వం మాత్రం సెంటు, సెంటున్నర భూమి ఇచ్చి కేంద్ర ఇచ్చే సాయంతో తామే గొప్పగా చేస్తున్నామని ఆర్భాటపు మాటలు చెబుతున్నారని ప్రజలందరూ గమనించాలన్నారు. తొలుత పెమ్మసాని చంద్రశేఖర్‌ను, నాదెండ్ల మనోహర్‌ను ఉమ్మడి పార్టీల శ్రేణులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికి దుశాలువాలతో సత్కరించారు. ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు లీలాశంకర్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు గోపీచంద్, తెలుగుమహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

తెనాలి రూరల్, ఏప్రిల్ 11: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌కు రోడ్డుషో దారిపొడవునా ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. గురువారం సాయంత్రం మండలంలోని నందివెలుగు నుండి కొల్లిపరమండలం అత్తోట గ్రామం వరకూ రోడ్డుషోగా ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేకర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు పర్యటించారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థుల గెలుపుతో రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని, ప్రజలకు అందించనున్న సంక్షేమాన్ని, రాజధాని అమరావతిగా తీర్చిదిద్ది రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించేలా జరగబోయే పానపై ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇరు పార్టీల అభ్యర్థులకు ఉమ్మడి పార్టీల శ్రేణులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు దిష్టితీసి హారుతులు పట్టారు." ఎద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



22వ వార్డులో పర్యటిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తదితరులు

దళితుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

● 22, 23 వార్డులో ఇంటింటి ప్రచారంలో ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11: ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 సంక్షేమ పథకాలను నిలిపివేసి దళితుల సంక్షేమాన్ని వైసీపీ పాలకులు పూర్తిగా విస్మరించారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని 22, 23 వార్డులో నరేంద్రకుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రజలు స్వాగతం పలికి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితుల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించి వారి సంక్షేమానికి పాటుపడ్డామన్నారు. విజ్ఞతతో ఆలోచించి టీడీపీ, జనసేన కూటమికి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ మేనిఫెస్టో ద్వారా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితులకు జరిగే మంచి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాదెండ్ల, పెమ్మసానిని గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మనోహరం, రాజ్యలక్ష్మి తదితరులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 11: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థులుగా పోటీచేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేకర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరుతూ నాదెండ్ల మనోహర్‌సతీమణి మనోహరం, పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం పట్టణంలోని 30, 31వ వార్డులో పార్టీ శ్రేణులతో కలసి వార్డు ప్రజలను కలుసుకుని ఉమ్మడి అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోడీల ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజలకు అందించే సంక్షేమం, రాష్ట్రంలో జరగనున్న అభివృద్ధిపై ప్రజలకు అవగాహనకల్పించారు. భావితరాల భవిష్యత్తుకోసం ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందామని వారు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



పొన్నూరు ఐటికంపాడు రోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన వేలాది మంది ముస్లింలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11: రంజాన్ పర్వదినం ఈద్ వుల్ ఫితర్‌ను సందర్భంగా గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని పలు మసీదులు, ఐటికంపాడు రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. పేదలకు జకాత్ రూపంలో ధానధర్మాలు చేశారు. ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనలకు వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. మత పెద్దలు ఖురాన్‌లోని నీతి సూక్తులను ప్రవచించారు. రంజాన్ విశిష్టతను పవిత్ర గ్రంథం ఖురాన్‌లో పొందుపరిచిన జీవన విధానాలను వివరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొరు ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే అంజుమన్ కమిటీ ఈ ఏడాది ఆదాయ, వ్యయాల గురించి ముస్లింలకు వివరించారు.

పార్థనలో పాల్గొన్న ధూళిపాళ్ల

దివ్య ఖురాన్ ఆదేశాల ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేది రంజాన్ మాసం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. పట్టణంలోని ఐటికంపాడు రోడ్డు ఈద్గాలో జరిగిన రంజాన్ సామూహిక ప్రార్థనలకు నరేంద్ర కుమార్ హాజరయ్యారు. మత పెద్దల దివ్య సందేశాన్ని ఆలకించటంతోపాటు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

తెనాలిలో...

తెనాలి అర్బన్: ఈదుల్ ఫితర్ రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని చెంచుపేట ఈద్గా మైదానంలో 25 మసీదుల ముతవల్లీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేకువ జామున నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు సంప్రదాయబద్ధంగా సేమ్యా, కర్జూరం తీసుకుని తలపై టోపీలు ధరించి ఈద్గా మైదానం చేరుకున్నారు. ఇమామ్ ముఫ్తీ షేక్ఆసత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పెద్దల సమాధులపై పూలు ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నమాజ్‌లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ శుభాకాంక్షలు అందించారు. చెంచుపేట ఈద్గా మైదానం చాలక పలుచోట్ల ఈద్ నమాజ్ నిర్వహించారు. షేక్ వలి, అహ్మద్ ఆలీ, బాబావలి, హసన్ పర్యవేక్షించారు.

● కొల్లిపర: మండలంలోని దావులూరు, తూములూరు, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో ముస్లింలు పవిత్రంగా బావించే రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షల అనంతరం గురువారం ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. ముస్లింలు తెల్లవారు ఝామున మత పెద్దల సమక్షంలో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



తెనాలిలో రంజాన్ సందేశం అందిస్తున్న ముస్లిం మత పెద్ద, ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

జ్యోతిరావుపూలేకు ఘన నివాళి



జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళి అర్పించిన నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11: దేశ ప్రథమ సామాజిక తత్వవేత్త జ్యోతిరావుపూలే అని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి ధూళిపాళ్ళ పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యం అన్ని నమ్మి బడుగులు, మహిళల విద్యాభివృద్ధికి బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో మాకాని రమేష్, మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు, బొర్రు రామారావు, మాకాని బలరామ్, యన్నం నాయుడు, తోటకూర నరేష్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నివాళి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పూలేచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకట కృష్ణారావు, కలపాల శ్రీనివాసరావు, భట్టిప్రోలు రామకృష్ణ తోట జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు

● పూలే జయంతి వేడుకలను గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఆరేటి రామారావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 11: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్తగా సమాజానికి పూలేచేసిన సేవలను గుర్తు చేశారు. కుర్రా శ్రీను, రాహుల్, సుబ్రహ్మణ్యం, పోతురాజు, రమేష్, మురళీ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

● తెనాలి, మారీసుపేట: సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని టీడీపీపార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పట్టణ మండలాధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరావులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, అంటరాని తనాన్ని రూపుమాపడానికి కృషి చేసిన సామాజిక సంస్కర్త, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, పణిదపు దుర్గా, కావేటి వేణు, మునిపల్లి దుర్గ, ఈదర వెంకట పూర్ణచంద్, నిమ్మకాలయల రమ్య, అడుసుమల్లి వెంకటేశ్వరావు, కొండా రమాదేవి, గుమ్మడి వీణ, ప్రసాద్, ఎన్‌టీఆర్ జగన్, సత్యం, మల్లవరపు విజయ్, అంజనేయులు అశోక్ వసంతం, ఆలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

● కుల వ్యతిరేక సంఘ సంస్కర్త అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని ఏపీ బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేట పట్టణ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికై పోరాడిన మహాయోధుడని కొనియాడారు. కార్యక్రమాన్ని పట్టణ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో బీసీ నాయకులు జొన్నాదుల రాహుల్, నిడుప్రోలు సుబ్రహ్మణ్యం, కడలిసాయి, బి.పోతురాజు, రమేష్, మురళి, వెంకటశివ కళ్యాణి, టి.ఈశ్వరికుమారి తదితరులు పాల్గొన్నారు.



తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో...